# 2020కి ప్రయోగాత్మక విద్య

## 50మిలియన్ల విద్యార్థులకు నైపుణ్యం : మంత్రి పల్లంరాజు

హైదరాబాద్ (వి.వి) : గ్రామీణ యువత పట్ల చిన్నచూపు లేకుండా ప్రాంతాల మధ్య అంతరాన్ని తుడిచే నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రయోజనాత్మకమైన విద్యను అందించేందుకు విశ్వ విద్యాలయాలు కృషి చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.ఎంఎం. పల్లంరాజు పిలుపునిచ్చారు. 2020 నాటికి కనీసం 500 మిలియన్ల మంది విద్యార్థులను నైపుణ్యం, నాణ్యత, విషయ ప్రావీణ్యం, భాష అంతర్జాతీయ ప్రమాణాలు గలవారిగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించే యోచనలో ప్రధానమంత్రి డా.మన్మోహన్‌సింగ్ ఉన్నారని వివరించారు. 'ఉన్నతవిద్యలో సమాచార సాంకేతిక పరిజ్ఞానపు నాయకత్వం' అంశంపై అంబేద్కర్ వర్సిటీ, సెమా, ఇగ్నోలు నిర్వహిస్తున్న మూడురోజుల సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ యువతకు ప్రయోజనాత్మక విద్య అందించడంలో విశ్వవిద్యాలయాలు ఏమేరకు కృషి చేస్తాయో చూడాలని నగరంలో బాంబుపేలుళ్ల బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ప్రధాని తనతో అన్నారని పల్లంరాజు చెప్పారు. జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలలో పాలిటెక్నిక్ మాదిరిగా 200 కమ్యూనిటీ కళాశాలలు ఎఐసిటిఇ కింద ప్రారంభించి టెక్నాలజీ సాధికారత, ప్రావీణ్యం ఇచ్చే కోర్సుల ద్వారా విద్యార్థులను అధిక సంఖ్యలో సమాజానికి అందించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుందన్నారు. తద్వారా ఆయా కంపెనీలు పరిశ్రమలు, మార్కెట్ అవసరాలను తీర్చడంతో పాటు ఉద్యోగభద్రత కల్గి ఆర్థికాభివృద్ధికి చేయూత ఇచ్చే విధంగా యువత రూపొందాలన్నారు. కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్రాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓపెన్ యూనివర్సిటీ ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆసక్తి కనబరిచే మొదటితరం వారిని సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తరగతిగదుల ద్వారా మంచి విద్యాబోధన చేయాలన్నారు. నిధుల సద్వినియోగం, నాణ్యమైన టెక్నాలజీ విద్య అందజేత, సమాజానికి ఉపయోగపడే విద్యార్థుల తయారీ పెద్ద సవాళ్లుగా ఉన్నా వీటిని అంచెలంచెలుగా అధిగమిస్తామన్నారు.

**4మిలియన్ల మందికి ట్యాబ్లెట్ పిసిలు :** బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ డా.పాల్ మాట్లాడుతూ 20మిలియన్ల ట్యాబ్లెట్ పిసిల సరఫరాకు ఇంటెల్‌తో కుదిరిన ఒప్పందం మేరకు త్వరలో 4మిలియన్ల మంది విద్యార్థులకు ట్యాబ్లెట్ పిసిలు అందిస్తామన్నారు. భారత్‌లో గ్రామీణ యువతకు నైపుణ్యం గల విద్య అందించేందుకు



భారత్‌తో కలిసి పనిచేసేందుకు బ్రిటన్ ప్రధాన మంత్రి డేవిడ్ కామెరాన్ అంగీకరించారని తెలిపారు. అంబేద్కర్ వర్సిటీ విసి ప్రకాష్, ఇగ్నో విసి గోపినాథ్, ప్రొ.అరుణ్‌లు పాల్గొన్నారు.

Visalaandhra

---

### సాంకేతిక పరిజ్ఞానంతోనే

# ఉన్నత విద్య అభివృద్ధి

- ఉపాధ్యాయ శిక్షణకు నిధుల కొరత లేదు
- టెక్నాలజీ వినియోగంపై వీసీలు దృష్టి పెట్టాలి
- దూరవిద్య ద్వారా ప్రాథమిక నైపుణ్యం అందించాలి: పళ్లంరాజు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని దూరవిద్యకు జోడించడం ద్వారా ఉన్నత విద్యలో మరింత అభివృద్ధి సాధించాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు అన్నారు. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'సమాచార సాంకేతిక వ్యవస్థ-ఉన్నత విద్యలో నాయకత్వం' అంశంపై మూడు రోజుల సదస్సు ఆదివారం ప్రారంభమైంది. దేశంలో దూరవిద్య కోర్సులు నిర్వహిస్తున్న 35 విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పళ్లంరాజు ప్రసంగిస్తూ- ఉపాధ్యాయ శిక్షణకు నిధుల కొరత ఉండబోదని స్పష్టం చేశారు. వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు తగ్గుతాయని ప్రచారం జరుగుతోందని.. కానీ, విద్యకు కేటాయింపులు తగ్గే అవకాశం లేదని చెప్పారు. దేశంలో ప్రస్తుతం ఉన్నత విద్యలో నమోదు 18 శాతం ఉందని.. 2020 నాటికి దాన్ని 30 శాతానికి పెంచడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పళ్లంరాజు తెలిపారు. ఉన్నత విద్యలో నాణ్యతపై రాజీపడే ప్రసక్తే లేదని పళ్లంరాజు స్పష్టం చేశారు. చాలామందికి ఓపెన్ వర్సిటీ డిగ్రీలంటే చాలా చిన్న చూపు ఉందని, ఆ భావన తొలగిపోవాలంటే నాణ్యమైన విద్యను అందించడమే మార్గమని అభిప్రాయపడ్డారు. దూరవిద్య ద్వారా ప్రాథమిక నైపుణ్యం పెంచే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంపై వీసీలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొత్త సెంట్రల్ వర్సిటీల్లో 70శాతం మేర ఫ్యాకల్టీ కొరత ఉందని చెప్పారు. దూర విద్య ద్వారా నాణ్యమైన విద్య అందించటం సాధ్యమా? అని తనను ప్రధానమంత్రి అడిగారని, ఐసీటీ వినియోగం ద్వారా నాణ్యమైన విద్యను అందించడానికి కృషి జరుగుతోందని వివరించానని పళ్లం రాజు చెప్పారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన యూజీసీ మాజీ చైర్మన్ అరుణ్ నిగ్వేకర్.. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో దేశం పెద్ద సవాల్‌ను ఎదుర్కొంటోందని చెప్పారు. కార్యక్రమంలో ఇగ్నో వీసీ డాక్టర్ గోపీనాథ్ ప్రధాన్, బీఆర్ అంబేద్కర్ వర్సిటీ వీసీ పి.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి పళ్లం రాజు

Andhra Jyothi



వీసీల సదస్సులో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి పల్లంరాజు

## రాష్ట్ర వర్సిటీలకు నిధుల కొరత: పల్లంరాజు

సాక్షి, హైదరాబాద్: కేంద్రీయ యూనివర్సిటీలకు నిధులు బాగానే ఉన్నాయని, రాష్ట్ర వర్సిటీలకే నిధుల కొరత ఉందని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ మంత్రి ఎం.ఎం. పల్లంరాజు వెల్లడించారు. వాటికి రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను సరిగ్గా కేటాయించడం లేదన్నారు. అందుకే రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (ఆర్‌యూఎస్ఏ) వంటి పథకాలను అమల్లోకి తేనున్నట్లు వెల్లడించారు. 'ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ లీడర్‌షిప్ ఇన్ హైయ్యర్ ఎడ్యుకేషన్' అంశంపై వివిధ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో మూడు రోజులపాటు నిర్వహించే సదస్సును పల్లంరాజు ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... దేశంలో 230 మిలియన్ల మంది పిల్లలు ఒకటి నుంచి 12వ తరగతి చదువుతున్నారని, వారందరికీ మెరుగైన ఉన్నత విద్యను అందించే చర్యలు చేపట్టాలన్నారు. యూజీసీ మాజీ చైర్మన్ అరుణ్ నిగవేకర్, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ ప్రకాష్, ఇగ్నో వీసీ గోపీనాథ్ ప్రధాన్, సౌత్ ఇండియా బ్రిటిష్ కౌన్సిల్, కామన్వెల్త్ మీడియా సెంటర్ డైరెక్టర్లు పాల్ సెల్లర్, సంజయ్ మిశ్రా పాల్గొన్నారు.

Sakshi

## అధ్యాపకుల కొరతను అధిగమిస్తాం: పళ్లంరాజు

హైదరాబాద్, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అధ్యాపకుల కొరతను తీర్చుకొనే ప్రయత్నం చేస్తామని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి పళ్లంరాజు చెప్పారు. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'సమాచార సాంకేతిక వ్యవస్థ- ఉన్నత విద్యలో నాయకత్వం' అనే అంశంపై ఆదివారమిక్కడ సదస్సు ప్రారంభమైంది. పళ్లంరాజు మాట్లాడుతూ.. దూరవిద్య, సార్వత్రిక విద్యలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం ద్వారా ఉన్నత విద్యలో మరింత అభివృద్ధి సాధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరతను తీర్చేందుకు వివిధ రూపాల్లో ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ప్రధానమంత్రితో ఈ సదస్సుపై చర్చించినట్లు చెప్పారు. స్పందించిన ప్రధాని.. ఉన్నత విద్యను మరింత బలోపేతం చేసేందుకు వర్సిటీల అధ్యాపకులు ప్రయత్నించాలని సూచించారన్నారు.

Eenadu